క్లుప్తంగా

అమరులకు ఘన నివాళి

పెంచికల్‌పేట్: అటవీ అమరవీరుల దినోత్సాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అమరవీరులకు బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారి సేవలు వెలకట్టలేనివి అన్నారు. ప్రతిఒక్కరూ అడవుల సంరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వోలు జమీల్, ముసావీర్, ఎఫ్ఎస్‌వోలు వేణుగోపాల్, ఆస్మా, జగన్‌మోహన్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేయాలి

తిర్యాణి: ఏజెన్సీ మండలాల్లో ఇంటర్‌నెట్ సదుపాయం లేక రేషన్ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా నాయకుడు సార రమేశ్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్‌నెట్ లేని ఏజెన్సీ మండలాల్లో మ్యానెవల్ పద్ధతిలో రేషన్ పంపిణీ చేయాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రభుదయ


ప్రభుదయా

వాంకిడి: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రభుదయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన నస్రుల్లా ఖాన్ బెజ్జూరు మండలానికి బదిలీపై వెళ్తుండడంతో సిర్పూర్(యూ) మండల ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభుదయ వాంకిడి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఆసిఫాబాద్అర్బన్: గత సంవత్సరం పోల్కార్ సుధాకర్‌ని కొంత మంది దుండగులచే చంపపడ్డారని, కాని నేటికి బాధిత కుటుంబానికి ఎలాంటి పరిహారం అందలేదని, నష్టపోయిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జాతీయ నాయకులు కేశవ్‌రావ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ ప్రాంగణం వద్ద ఉన్న శ్మశాన వాటిక భూమిని ఎమ్మార్పీఎస్‌కు కేటాయించాలని కోరారు. జగ్జీవన్‌రాం చౌక్‌ను నిర్మించి సంవత్సరం గడుస్తున్నా.. నిర్మాణానికి సంబంధించిన ఎలాంటి బిల్లులు రాలేదన్నారు.

కళాశాల భవనాన్ని నిర్మించాలి

కాగజ్‌నగర్ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ షెడ్లను తొలగిస్తాం

కౌటాల: మండల కేంద్రంలోని పాత ఐకేపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అక్రమ షెడ్లను తొలగిస్తామని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాత ఐకేపీ కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుతామని, ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నేటి నుంచి సభ్యత్వ నమోదు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 15వ వరకు సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్ తెలిపారు. ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన వారు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని గన్నారం రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం విజ్ఞానదర్శిని ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు, మంత్రాలు, మహిమలు, అతీతశక్తులు, జాతకాలు కల్పితమన్నారు. ప్రజలు సైన్స్ ఆధారంగా ఆలోచించి విషయాలను విశ్లేషించాలన్నారు. అనంతరం మ్యాజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆదాం రాజ్, మహ్మద్ అలీ, మహేశ్, జిల్లా బాధ్యులు నగేశ్, రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు త్రివేణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

కెరమెరి: మండల కేంద్రంతో పాటు నెహ్రూనగర్, సేవాలాల్‌నగర్, శివమందిర్, విద్యానగర్ ప్రాంతాల్లో లంబోదరుడికి నిత్యం పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం అంతటా చిన్నారులు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కుకుంటున్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో గిరిజన బాలికల, బాలుర గురుకుల పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి ప్రిన్సిపాల్ అనిత, భద్రయ్య ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించి తుంపెల్లి వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓంకార్, మల్లేశ్వరి, అధ్యాపకులు పద్మ, వెంకటేశ్ పాల్గొన్నారు.

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. మండల కేంద్రంలో బుధవారం విఘ్నేశ్వరుడికి మహిళలు కుంకుమార్చన పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే గణేశ్ మండపాల్లో భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సింగరేణి కాలనీలో ప్రతిష్ఠించిన గణేశ్ మండపం వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

కౌటాల: మండలంలోని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండపల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

అన్నదానం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పలు గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. సిర్పూర్(టి) పరిధిలోని అంగడిబజార్ ప్రాంతంలోని గణేశ్ మండపం వద్ద, డౌనల్ ప్రాంతంలో భజరంగ్ దళ్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దోబీ కాలనీలో గణేశ్ మండపం వద్ద అన్నదానం చేశారు.

బెజ్జూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బెజ్జూర్ గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బుధవారం శ్రీరంగనాయక ఆలయ ప్రాంగణంలో భక్తుల కు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో శ్రీరంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడుపెల్లి మహేశ్, పుల్లూరి సతీష్ కుమార్, సామల కిరణ్ కుమార్, మిరియాల పెంటన్న, నేరెళ్ల సంతోష్ కుమార్, రాచకొండ శ్రీవర్ధన్, తంగేడుపెల్లి నీలేష్, శ్రీరామ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: రాస్పెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొర్రెగూడ, పెద్దవాడ, గోవారిగూడ గ్రామాల్లో గల వినాయక మండళ్ల వద్ద బుధవారం బీజేపీ నాయకులు అన్నదానం నిర్వహించారు.


కెరమెరి: పూజలు చేస్తున్న చిన్నారులు


నిమజ్జన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు


రెబ్బెన: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

తులం బంగారం ఇవ్వాలి

- హామీలు నెరవేర్చని ప్రభుత్వం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగుదుతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. లేదంటే హామీలు నెరవేరే వరకు పోరాటం చేస్తామన్నారు. చాలా మంది లబ్ధిదారులు తులం బంగారం కోసం ఎదురు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రూ. 100116లను కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది మాసాలు దగ్గరపడుతున్న ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. 45 మంది కల్యాణలక్ష్మి, 6 గురికి షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయంలోనే సంక్షేమ ఫలాలు

వాంకిడి: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే అందరికీ సంక్షేమ ఫలాలు అందయని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. 59 మందికి కల్యాణలక్ష్మి, 3 గురికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అధికారంలో వచ్చాక విస్మరించిందని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, మాజీ జెడ్పీటీసీ అజయ్‌కుమార్, బండె తుకారాం పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారఖ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులకు అందించాలన్నారు. ఆసిఫాబాద్ మండలానికి చెందిన 129 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్, భీమేష్, బాబురావ్, శ్రీనివాస్, రవీందర్, గోపాల్ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ఆసిఫాబాద్అర్బన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల్లో నష్టపోయిన ఖమ్మం, మహబూబాబాద్, విజయవాడతో పాటు, త్రిపుర రాష్ట్రంలోని కార్మిక కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు బుధవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో వరద సహాయ నిధి కోసం విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ.. దాతల సహకారంతో సేకరించిన నిధిని కమిటీల ద్వారా వరద బాధితులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు ఫైమా, తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

కౌటాల: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని మహర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగబద్ధంగా లేదన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఎస్సీ, ఎస్టీ ఉప కూలాల హక్కులకు భంగం కలుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ మండల అధ్యక్షుడు బండురావు, ప్రధాన కార్యదర్శి దీలిప్, గోవింద్‌రావు, విజయ్, మారుతి, ఏమాజీ, మారుతి, శంకరయ్య, సంజీవ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీలో జరుగుతున్న పోరాటానికి మద్దతుగా బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు డోంగ్రె సునీల్, మాల మహానాడు అధ్యక్షుడు పరుస వెంకటేశ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలన్నారు. దుర్గం ఇస్తారు, అజయ్‌కుమార్, తిరుపతి, రాజనర్సయ్య, శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, బాలాజీ, కుమారస్వామి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం నాయకులు

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో తుకారాం భట్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ఉషా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, పరిసరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు వస్తుంటారని, రక్త పరీక్షల నిర్ధారణ అనంతరం చికిత్స అదించాలన్నారు. విషజ్వరాల సంబంధిత వైద్య సేవలను అందించడంతో పాటు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సేవల సంబంధిత ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. తాజాగా కూరగాయలు వినియోగించాలన్నారు. డీటీడీవో రమాదేవి, హెచ్ఎం చంద్రశేఖర్, పీడీ మధుసూదన్ ఉన్నారు.


పేద విద్యార్థులకు ఆర్థికసాయం

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం పలువురు విద్యార్థులకు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి ఆర్థికసాయం అందించారు. సిర్పూర్(యూ) మండలం పులారా గ్రామానికి చెందిన మర్సుకోల బాదిరావు కుమారుడు కృష్ణ(ఐఐటీ రాయచూర్), వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం మహేందర్ కుమారుడు అర్జున్(ఐఐటీ జోద్‌పూర్)కు ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం రూ.50వేల చొప్పున చెక్కులు అందజేశారు.


ఆసుపత్రిలో బోర్డు పరిశీలిస్తున్న కలెక్టర్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కాగజ్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని నేతన్నల మేలు కోసం రుణమాఫీ ప్రకటించడం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లుమ్స్‌కు పద్మశాలి బిడ్డ కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టడం గొప్ప విషయమని పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని కోసినిలో గల బెజ్జూర్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దహెగాం: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. బుధవారం మండలంలోని ఐనం, చౌక, కోత్మీర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నీటి నమూనాలు పరిశీలించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలన్నారు. మురుగు నీరు ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఈజీఎస్ ఏపీవో కల్పన, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని స్పెషల్ కాంపెయిన్ 4.0 (స్వచ్ఛతత) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ కాంపెయిన్‌ను రెండు విడుతల్లో నిర్వహించాలన్నారు. ఈనెల 16 నుంచి 30వరకు వ తేదీ వరకు , రెండో విడుత అక్టోబర్ 2 నుండి 31 వరకు చేపట్టాలని అన్నారు. ముందుగా కార్యాలయాలు, కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అన్ని గనులు, డిపార్టుమెంట్‌లను శుభ్రంగా ఉంచుకోవాలని ఈసారి బెల్లంపల్లి ఏరియాను స్వచ్ఛతలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవోలు నరేందర్, ఏరియా ఇంజనీర్ భీంరావ్ జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏరియా జీఎం శ్రీనివాస్

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

కౌటాల: వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని డీఆర్డీవో దత్తారావు అన్నారు. కౌటాల బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు అనారోగ్యం బారిన పడితే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే ఐకేపీ సభ్యురాలు చేపట్టిన హోటల్‌ను పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కోట ప్రసాద్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎంపీవో మహేందర్, వార్డన్ రేష్మా, కార్యదర్శులు సాయికృష్ణ, కవిత పాల్గొన్నారు.


రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఆర్డీవో దత్తారావు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు బుధవారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు నిజమైన మానవత్వానికి ప్రధానమైన సుగుణం అనే అంశంపై, ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ధనం వస్తుంది, పోతుంది, నీతి వస్తుంది, విస్తరిస్తుంది అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి జిల్లా, రాష్ట్రస్థాయిలో ముగ్గురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు జనార్దన్, జిల్లాయూత్ కోఆర్డినేటర్ కొడిప్యాక సతీశ్, భార్గవి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు ఐచర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని కోసిని వద్ద ఐచర్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా.. రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఎండి అఫ్జల్, ఫారూక్‌లతో పాటు బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న మహారాష్ట్రలోని పోడ్సాకు చెందిన మున్నాపై కూడా కేసు నమోదు చేయడంతో పాటు వ్యాన్‌ను సీజ్ చేశారు.

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన రితిక్, నౌషద్, సల్మాన్ అనే ముగ్గురు ఇళ్లల్లో మహారాష్ట్రకు తరలించేందుకు నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారం మేరకు చింతలమానపల్లి ఎస్సై నరేశ్ మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. నౌషద్ వద్ద 20 క్వింటాళ్లు, రితిక్ వద్ద 22 క్వింటాళ్లు, సల్మాన్ వద్ద 2 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించగా, వాటిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

ఒంటికాలిపై కార్మికుల నిరసన

ఆసిఫాబాద్అర్బన్: సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని బుధవారం జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రి ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఒంటికాలిపై నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీశైలం, మల్లేశ్, మురళి, మమత, నీల, గుణవంత్‌రావు పాల్గొన్నారు.

మెదక్ చర్చిని సందర్శించిన 'పాల్వాయి'

కాగజ్‌నగర్‌రూరల్: మెదక్ పట్టణంలోని వందేళ్ల చరిత్ర కలిగిన కేథడ్రల్ చర్చిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు సందర్శించారు. చర్చి చారిత్రక నేపథ్యం గురించి కమిటీ సభ్యులు వివరించారు. ఫాస్టరేట్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందించారు.

మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ.. వాంకిడి మండల కేంద్రంలో జన్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన 90 సంవత్సరాల వయస్సులో ఢిల్లీలో నిరహార దీక్ష చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, గణేష్, బాపూజీ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక సమావేశం

కెరమెరి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులకు, గ్రామ కార్యదర్శులకు, ఉపాధి హామీ పథకం టీఏ, ఎఫ్ఏలకు ప్రత్యేక సమావేశం నిర్వహించన్నుట్లు ఎంపీడీవో అంజద్‌పాషా ఒక ప్రకటనలో తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

రెబ్బెన: మండలంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జర్నలిస్టులు కోరారు. బుధవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి చెందిన వర్కింగ్ జర్నలిస్టులో గతంలో కొంత మందికి మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించారని అన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

ఆసిఫాబాద్అర్బన్: గణేశ్ నిమజ్జన ఊరేగింపులకు డీజేలకు అనుమతి లేదని సీఐ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం డీజే ని ర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సుప్రీంకో ర్టు సూచనల మేరకు డీజే సౌండ్ సిస్టంకు అనుమతులు లేవన్నారు. అనుమతులు లేకుండా వినియోగిస్తే గణేశ్ మండపాల నిర్వాహకులపై, డీజే సౌండ్ సిస్టమ్ యాజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899